న్యూస్‌రీల్

పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజ్ దగ్గర నుంచి 4,513 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం స్థిరంగా ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవల్‌కి 216 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,526 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 327, పశ్చిమ కాలువకు 118, నిజాం పట్నం కాలువకు 281, కొమ్మూరు కాలువకు 2,800 క్యూసెక్కులు బ్యారేజి నుంచి విడుదల చేశారు. సముద్రంలోనికి 43,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నేటి పోలీస్ గ్రీవెన్స్ తాత్కాలికంగా రద్దు

నగరంపాలెం: దీపావళి పండుగ సందర్భంగా సోమవారం గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని అన్నారు.

రెడ్ల సత్రానికి రూ.5 లక్షల విరాళం



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ యోగి వేమారెడ్డి రెడ్ల సత్రంలో లిఫ్ట్ ఏర్పాటుకు పట్టణానికి చెందిన వెన్నపూస జోసెఫ్‌రెడ్డి రూ.5 లక్షల విరాళం అందజేశారు. సత్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో విరాళం మొత్తాన్ని దాత జోసెఫ్‌రెడ్డి సత్రం కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భవనం రాఘవరెడ్డి, కార్యదర్శి పొలిమేర వెంకటరెడ్డి, కోశాధికారి మాగులూరి సుబ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టు పాపిరెడ్డి, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, జాయింట్ సెక్రటరీలు బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ కార్యదర్శి ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాంచీస్టేషన్‌ను సందర్శించిన డివిజనల్ మేనేజరు




విజయపురిసౌత్: పర్యాటక శాఖ విజయవాడ డివిజనల్ మేనేజర్ చైతన్య ఆదివారం విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా లాంచీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లాంచీల్లో సందర్శకుల భద్రతకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హరిత రిసార్ట్ మేనేజర్ మస్తాన్‌బాబు, ఎత్తిపోతల మేనేజర్ యల్లాల బ్రహ్మం, వినయతుల్లా, దత్తు, పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 588.40 అడుగులకు చేరింది. ఇది 307.2834 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,302, ఎడమ కాలువకు 8,718, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 33,292, ఎస్ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 300 క్యూసెక్కులు విడుదలవుతోంది. సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 53,412 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 53,412 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

మహాదేవిగా పూజలందుకున్న బగళాముఖి



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో బగళాముఖి అమ్మ వారు ఆదివారం మహాదేవి అలంకరణలో పూజలందుకున్నారు. భక్తుల కొంగు బంగారంగా బాసిల్లుతున్న బగళాముఖి అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూలు, పండ్లు సమర్పించారు. పూజలు చేశారు. సోమవారం అమావాస్య సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 81వ అమావాస్య హోమం, విశేష పూజలు నిర్వహించనున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు.



గుజ్జనగుండ్ల చేబ్రోలు హనుమయ్య కంపెనీలో కొనుగోలుదారులు



టపాసులతో చిన్నారులు

మార్కెట్లలో దీపావళి సందడి

గుంటూరు నగరంలో దీపావళి శోభ ఆదివారమే కనిపించింది. టపాసుల దుకాణాల వద్ద చిన్నాపెద్దా తేడా లేకుండా నచ్చిన బాణసంచా కొనుగోలుకు నగరవాసులు తరలివచ్చారు. వివిధ రకాల బాణసంచా కొనుగోలు చేశారు. గుజ్జనగుండ్ల చేబ్రోలు హనుమయ్య కంపెనీలో కొనుగోలుదారులతో సందడి నెలకొంది. మరోవైపు నగరంలోని పూల మార్కెట్‌లోనూ కొనుగోళ్లతో పండుగ కళ కనిపించింది.

– సాక్షిఫొటోగ్రాఫర్, గుంటూరు



పూల మార్కెట్లో రద్దీ

కలిగిస్తే పుష్టి.. అదే అసలైన అస్థి

- నేడు 'వరల్డ్ ఆస్టియోపొరోసిస్ డే'
- పట్టుకుంటేనే ఎముకలు విరిగిపోయే వ్యాధిపై అవగాహన ముఖ్యం
- ఎండ తగలకపోవటమే ప్రధాన లోపం
- యువతలోనూ నానాటికీ పెరుగుతున్న ఎముకల సమస్యలు

గుంటూరు మెడికల్: గుంటూరు బ్రాడీపేటకు చెందిన జి.రామోహన్‌రావు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. విధుల్లో భాగంగా నిత్యం ఏసీ గదుల్లో కూర్చుంటారు. ఇటీవల దసరా సెలవులకు సొంత ఊరు వచ్చి ద్విచక్ర వాహనంపై షాపునకు వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యారు. పాతికేళ్లకే చిన్న ప్రమాదానికి ఎముక విరగడంతో వైద్యులు ఆశ్చర్యపోయారు. పరీక్షలు చేసి ఎండ తగలకుండా ఏసీ గదుల్లో ఆధునిక జీవనశైలి వల్ల ఆస్టియోపొరోసిస్‌కు గురైనట్లు నిర్ధారించారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఇంటర్నేషనల్ ఆస్టియోపొరోసిస్ ఫౌండేషన్ (ఐఓఎఫ్) 1996 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 20న వరల్డ్ ఆస్టియోపొరోసిస్ డేను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.



ఆస్టియోపొరోసిస్ డే పోస్టర్లు

ఎండ తగలక ఇబ్బందులు

చిన్న చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవటం ఆస్టియోపొరోసిస్ వ్యాధి (బోలు ఎముకల వ్యాధి) సోకినవారిలో కనిపించే ప్రధాన లక్షణం. ఆధునిక జీవనశైలి వల్ల నేడు యువతలో కూడా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తూ ఉండటంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల, పాఠశాలల పిల్లల్లో చాలా మంది ఎండ ఏ మాత్రం తగలకుండా ఏసీ గదుల్లో ఉంటున్నారు. వీరు ఆటలు ఆడేందుకు కూడా ఎండలోకి వెళ్లకపోవటంతో దెబ్బ తగిలిన సమయంలో ఎముకలు విరిపోతున్నాయి.

బాధితులు అధికమే...

సాధారణంగా ఆడవారిలో మోనోపాజ్ దశ దాటిన తరువాత 40 ఏళ్ల వయసులో, మగవారిలో 50 ఏళ్ల వయస్సు వారిలో ఈ వ్యాధి కనిపిస్తుంది. ఆధునిక జీవనశైలి వల్ల నేడు 20 శాతం మంది యువత వ్యాధి బారిన పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా వయోవృద్ధుల్లో 33 శాతం మంది తుంటి విరిగిపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నారు. వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు ఇలా పడి మరణిస్తున్నారు. ఆడవారిలో 50 ఏళ్లు దాటిన ప్రతి ముగ్గురిలో ఒకరు, మగవారిలో 12 మందిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. జిల్లాలో 200 మంది ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఉన్నారు. రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఓపీ వైద్య విభాగానికి 50 మందికి పైగా వివిధ రకాల ఎముకల సమస్యలతో వస్తున్నారు. వీరిలో 15 మంది ఆస్టియోపొరోసిస్ బాధితులే ఉంటున్నారని వైద్య నిపుణులు చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌లో కూడా రోజూ వివిధ రకాల ఆర్థోపెడిక్ సమస్యలతో 200 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 40 మంది ఈ వ్యాధి బాధితులే ఉన్నట్లు పరీక్షల అనంతరం వైద్యులు నిర్ధారిస్తున్నారు.

కారణాలు ఇవీ ...

కుటుంబంలో ఎవరికైనా ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా ఇతరులకు వచ్చే అవకాశం ఉంది. సరైన పోషకాహారం తీసుకోకపోవటం, మద్యపానం, ధూమపానం వంటి చెడు అలవాట్లు, థైరాయిడ్, లివర్ వ్యాధుల వల్ల, కొన్ని రకాల మందులు వాడటం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. రోజంతా ఏమాత్రం ఎండలోనికి రాకుండా ఏసీలోనే గంటల తరబడి గడపటం వల్ల ఈ వ్యాధి వస్తుంది. శారీరక వ్యాయామం ఏమాత్రం చేయనివారికి, ముఖ్యంగా రోజూ కనీసం అరగంట కూడా నడవకపోవటం వల్ల ఇది సోకుతుంది. రక్తపరీక్షల ద్వారా, ఎక్స్‌రే ద్వారా, ఎముకల సాంద్రత పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేయొచ్చు.

ఇవీ వ్యాధి లక్షణాలు...

వయస్సుపైబడిన వారిలో నడుమునొప్పి, వెన్నెముక ఎదుగుదల లోపించి ఎత్తు ఆగిపోవటం, ఒంటి నొప్పులు, ఎలాంటి పనులు చేయలేక పోవటం, నీరసం,నిరాశ, ఓపిక లేకపోవటం తదితర లక్షణాలు ప్రాథమిక దశలో కనిపిస్తాయి. ఎండ నుంచి శరీరానికి లభించే డి-విటమిన్ దొరక్కపోవడం కూడా వ్యాధికి ఒక కారణం. లక్షణాలు కనిపించిన వెంటనే ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలి. అశ్రద్ధ చేస్తే వెన్నెముక, చేతి మణికట్టు, తుంటి వద్ద ఏ మాత్రం చిన్న దెబ్బ తగిలినా.. చివరికి ఇంటి గడప కాలికి తగిలినా ఎముకలు విరిగిపోతాయి.

క్యాల్షియం స్థాయిలు పెంచాలి



వ్యాధికి చికిత్సలో భాగంగా శరీరంలో క్యాల్షియం లెవల్స్ పెంచాలి. పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవటం ద్వారా క్యాల్షియం పెంచుకోవచ్చు. విటమిన్ – డి కోసం ప్రతిరోజూ కొంతసేపు ఎండలో ఉండాలి. వయస్సు మళ్లిన వారికి , గర్భిణులకు, గర్భసంచి తొలగింపు ఆపరేషన్ చేయించుకున్నవారికి, పీరియడ్స్ రావటం పూర్తిగా ఆగిపోయిన వారికి అదనంగా రోజూ విటమిన్-డి, క్యాల్షియం మాత్రలు ఇవ్వాలి. నిత్యం తగిన పోషకాహారాన్ని అందించాలి. పొగతాగటం, మద్యం సేవించటం వంటి చెడు అలవాట్లను అందరూ విడనాడాలి. రోజూ తప్పనిసరిగా అరగంటసేపైనా నడవాలి.

–డాక్టర్ సూరత్ అమర్‌నాథ్, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, గుంటూరు

అవగాహన ముఖ్యం



రోజూ వ్యాధి బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఓపీకి వచ్చే వారిలో 25 శాతం మంది ఈ వ్యాధి బాధితులే. యువకులు కూడా ఈ వ్యాధి బారిన పడడం ఆందోళనకరమైన అంశం. కొన్నిసార్లు వైద్య పరీక్షల్లో రిపోర్టులు నార్మల్‌గా ఉన్నా నొప్పులు ఉంటాయి. నొప్పులు ఉంటే వ్యాధిగా గుర్తించి చికిత్స చేయించుకోవాలి. ఈ వ్యాధి వల్ల వెన్నెముక కూడా బోలుగా మారిపోయి కొద్దిపాటి దెబ్బకే విరిగిపోయి జీవితం చాలా దుర్భరంగా మారుతుంది. కీళ్లవాతం, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఆస్టియోపొరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వీరు ముందస్తుగా పరీక్షలు చేయించాలి.

– డాక్టర్ జి. నరేష్‌బాబు, సీనియర్ స్పయిన్ సర్జన్, గుంటూరు

కార్తిక పూజలకు శివాలయం ముస్తాబు



పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసానికి సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ అధికారి, ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్తికమాస ఏర్పాట్లపై ఆదివారం డీసీ మాట్లాడుతూ కార్తిక మాసం సందర్భంగా ఈనెల 22 నుంచి నవంబరు 20వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక కల్యాణార్థం నెలరోజులపాటు ఉదయం మహాన్యాస పూర్వక రుద్రజప, రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేక పూజలు నిర్వహించనున్నామని తెలిపారు. సాయంత్రం 4.30 నుంచి 7 గంటల వరకు అష్టోత్తర పూజ జరుగుతుందన్నారు. నెల రోజులపాటు నిత్య పరోక్ష అభిషేక పథకాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు చెప్పారు. రూ.వెయ్యి చెల్లించి ఈ పథకంలో పాల్గొనే భక్తులకు కార్తిక మాసం అనంతరం స్వామివారి ప్రసాదం వారి చిరునామాకు పోస్టు ద్వారా పంపిస్తామని తెలిపారు. ఈ పథకంలో చేరిన భక్తులను కార్తిక మాసంలో ఆది, సోమవారాలు, పౌర్ణమి రోజులు మినహా ఇతర రోజుల్లో ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామి వారి దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి ఎలాంటి ఇబ్బంది కూడా కలగకుండా త్వరగా దర్శనం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా శాంతిభద్రతల నిమిత్తం పోలీసు, అగ్నిమాపక, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖల సిబ్బంది సేవలు వినియోగించుకుంటామని చెప్పారు. కార్తిక మాసం పర్వదినమైన పౌర్ణమి రోజున కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

స్త్రీనిధి.. హతవిధి!

- స్త్రీనిధి రుణాల రికవరీపై వెలుగు అధికారుల నిర్లక్ష్యం
- రూ.1.23 కోట్ల 'ఎన్‌పీఏ'తో కొత్త రుణాలు కరువు
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక్కరికీ దొరకని అప్పు
- తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న పేద మహిళలు
- మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్న డ్వాక్రా సభ్యులు

ప్రత్తిపాడు మండలంలో స్త్రీ నిధి రుణాల ప్రక్రియ ప్రహసనంగా మారింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 9 కోట్ల రుణాల మంజూరుకు అవకాశం ఉన్నప్పటికీ, పాత బకాయిలు ఎన్‌పీఏలోకి వెళ్లడంతో నూతనంగా ఇవ్వలేని పరిస్థితి చోటుచేసుకుంది. మహిళలు మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆ అప్పులకు వడ్డీలు అధికంగా చెల్లిస్తూ రుణాల ఊబిలో కూరుకుపోతున్నారు.



ప్రత్తిపాడు: మండలంలో 2022-23, 2023-24, 2024–25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 4,441 మంది మహిళలకు రూ. 23 కోట్ల మేర స్త్రీ నిధి రుణాలిచ్చారు. ప్రస్తుతం అప్పు నిల్వ రూ. 4.84 కోట్లు ఉండగా, బకాయిలు రూ. 76.09 లక్షలు ఉన్నాయి. కాగా రూ. 57.68 లక్షలు ఎన్‌పీఏ కిందకు చేరాయి. మొత్తం మీద ప్రస్తుతం రూ. 1.23 కోట్ల మేర ఎన్‌పీఏ ఔట్ స్టాండింగ్ ఉంది. పాతవి రికవరీ చెయ్యక.. కొత్తవి మంజూరు కాక.. స్త్రీనిధి బకాయిల్లో ఓవర్ డ్యూ రూ. 57 లక్షలు రికవరీ అయితే గానీ కొత్త రుణాలు ఇవ్వడం సాధ్యపడదు. వెలుగు అధికారులు రికవరీపై దృష్టి సారించకపోవడంతో అప్పుల కుప్ప పెరిగిపోయి కూర్చుంది. కనీసం ఓవర్‌డ్యూలో సగం అయినా రికవరీ చేస్తే కొత్త వారికి స్త్రీనిధి రుణాలు మంజూరు చేయవచ్చు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇబ్బందులే

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 9.30 కోట్లు స్త్రీ నిధి ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణం కింద ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. కానీ ఎన్‌పీఏ ఔట్ స్టాండింగ్ రూ. 20 లక్షల కన్నా అధికంగా ఉంటే స్త్రీనిధి రుణాలు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్కరంటే ఒక్కరికీ రుణం ఇవ్వని దుస్థితి చోటుచేసుకుంది. సుమారు 931 మంది మహిళలు రుణానికి అర్హులుగా ఉన్నారు. కానీ అప్పు ఇవ్వకపోవడంతో మహిళలు స్థానికంగా ఉన్న మైక్రోఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం ..

స్త్రీనిధి రుణాల రికవరీపై వెలుగు శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. 2022-23లో ఎన్‌పీఏ ఔట్ స్టాండింగ్ రూ.10.52 లక్షలు, 2023-24లో రూ. 2.81లక్షలు, 2024-25లో రూ.15 లక్షల మేర ఉంది. ప్రస్తుతం ఆ మొత్తం రూ.1.23 కోట్లకు చేరిందంటే రికవరీ పట్ల అధికారుల అలసత్వం గురించి వేరే చెప్పనక్కర్లేదు.

పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా..

అంతే కాకుండా మండలానికి చెందిన ఒక గ్రామంలోని డ్వాక్రా మహిళలు తాము తీసుకున్న స్త్రీ నిధి బకాయిలకు సంబంధించిన నగదు తమ వీవో ఖాతాలో వేశామని, ఆ మొత్తాన్ని స్త్రీనిధి బకాయి కింద జమ చేసుకోవాలని కోరుతున్నా అధికారులు మాత్రం రకరకాల కారణాలను చూపుతూ జమ చేసుకోవడం లేదన్నారు. దీంతో సదరు ఖాతాలు ఎన్‌పీఏలోనికి వెళ్లిపోయాయి. దీంతో ఏం చేయాలో పాలుపోని సంబంధిత సభ్యుల కుటుంబీకులు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది.

సీసీలకు మెమోలిచ్చాం

స్త్రీనిధి రుణాల రికవరీ అంతగా లేకపోవడంతో సంబంధిత క్లస్టర్‌ల సీసీలకు మెమోలు కూడా ఇచ్చాం. లోన్ పాలసీ ప్రకారం రూ.20 లక్షలకు పైన ఎన్‌పీఏ ఉంటే మండలం ఆటోమేటిక్‌గా బ్లాక్ అయిపోతుంది. రూ.20 లక్షల కన్నా దిగువకు ఎన్‌పీఏ తగ్గితే అప్పుడు రుణాలు ఇవ్వవచ్చు. రికవరీపై పూర్తి స్థాయి దృష్టి సారించాం.

– ఎస్. హర్షవర్ధన్, ఏజీఎం, స్త్రీనిధి

సహాయకుడే నిందితుడు

- కాటికాపరి హత్యకేసులో పోలీసుల నిర్ధారణ
- పోలీసుల అదుపులో నిందితుడు
- వేధింపులు భరించలేక హత్య చేసినట్టు అంగీకారం

నరసరావుపేట రూరల్: సంచలనం సృష్టించిన స్వర్గపురి–2 కాటికాపరి తాటిపర్తి ఎఫ్రాన్ హత్య కేసు మిస్టరీ వీడినట్టు తెలుస్తోంది. సహాయకుడే ఈ హత్య చేసినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారని సమాచారం. క్రిస్టియన్‌పాలెంలో ఉన్న గ్రూపు తగాదాల వలన హత్య జరిగి ఉంటుందని పోలీసులు మొదట భావించారు. సాక్షిగా తీసుకువచ్చిన ఎఫ్రాన్ సహాయకుడిని తమదైన శైలిలో పోలీసులు విచారించగా అసలు నిజం వెలుగుచూసింది. తానే హత్యకు పాల్పడినట్టు అతడు అంగీకరించినట్టు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. శివ సంజీవయ్య కాలనీకి చెందిన వ్యక్తి ఎఫ్రాన్ వద్ద సహాయకుడుగా పని చేస్తున్నాడు. కొంతకాలంగా ఎఫ్రాన్ వేధింపులు ఎక్కువయ్యాయి. నగదు సరిగా ఇవ్వకపోవడం, అవమానకరంగా దుర్భాషలాడటం, దాడులు చేయడంతో విసిగిపోయి హతమార్చినట్టు తెలిసింది. నిందితుడు తొలుత క్రిస్టియన్‌పాలెంకు చెందిన వారు హత్యకు పాల్పడినట్టు తప్పుడు సమాచారం ఇచ్చాడు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు.



పూజాబలిని సమర్పిస్తున్న భాగ్యయ్య

లోక రక్షకుడిని స్మరించుకోవాలి

రెంటచింతల: ఏసుక్రీస్తు జయంతి జూబ్లీ వేడుకలలో లోకరక్షకుడైన ఏసయ్యను క్రైస్తవులందరూ స్మరించుకోవాలని గుంటూరు మేత్రాసన పీఠాధిపతి మహా ఘన డా. చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. ఆదివారం కానుకమాత కళావేదిక వద్ద విచారణ గురువులు రెవ. ఫాదర్ వైఎల్ మర్రెడ్డి ఆధ్వర్యంలో క్రీస్తు జయంతి జూబ్లీ వేడుకల సమష్టి పవిత్ర పూజాబలి సమర్పించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచ శాంతి కోసం ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వస్థత, ఆరాధన, విశ్వాసం పేరిట ఇవి కొనసాగుతున్నాయని వివరించారు. క్రైస్తవుల కోసం ప్రతి ఒక్కరూ తమ పాత్రను గుర్తించి ప్రార్థించాలన్నారు. ఫాదర్లు, కన్యలు, విశ్వాసులు పాలుపంచుకోవడం అభినందనీయం అన్నారు.

క్లుప్తంగా

ఎంపీహెచ్ఈఓ జిల్లా అధ్యక్షుడిగా పున్నారెడ్డి



గుంటూరు మెడికల్: మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎంపీహెచ్ఈఓ) జిల్లా అధ్యక్షుడిగా తెనాలికి చెందిన కె.పున్నారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరు ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో పున్నారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా వి.జె.జయకుమార్, సహ అధ్యక్షుడిగా ఎస్.శివగణేష్, ఉపాధ్యక్షులుగా బి.వెంకటప్పయ్య, జి.దుర్గాప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా ఎం.రాజేష్, కె.రామయ్య, జిల్లా కోశాధికారిగా ఎం.వెంకటరామయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.చల్లమ్మను ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.శివయ్య, స్టేషన్ జనరల్ సెక్రటరీ కె.రామరాజు ఆధ్వర్యంలో ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎ.కె.ఆర్.సి.మురళీప్రసాద్, పరిశీలకులుగా కె.ఎల్.మనోహర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా 'సిద్దాడపు'



గురజాల: అఖిల భారతీయ యాదవ మహాసభ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా సిద్దాడపు గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అఖిల భారతీయ యాదవ సభ ఏపీ, పుదుచ్చేరి రాష్ట్రాల సంయుక్త సమావేశం ఆదివారం యానాంలోని క్షత్రియ పరిషత్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నికలు జరిగాయి. ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా దాదినబోయిన ఏడుకొండలు యాదవ్, పల్నాడు జిల్లా కార్యదర్శిగా సంక్రాంతి వెంకటేశ్వర్లు, గురజాల నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షుడిగా జి.కృష్ణంరాజు యాదవ్‌లను ఎన్నుకున్నారు. వీరి నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

బాణసంచాతో... జర భద్రం

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. ప్రమాదమే..
- చిన్నారులతో మరింత జాగ్రత్త అవసరం
- చిన్న ప్రమాదం జరిగినా.. భారీ మూల్యం చెల్లించాల్సిందే...



బాణాసంచా

పట్నంబజారు: సంతోష సంబరాలతో.. వెలుగులు నింపే పండుగ దీపావళి. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎంతో సంతోషంగా జరుపుకునే పండుగే దీపావళి. వెలుగుల కాంతులు.. చిన్నారుల కేరింతలు.. ఆనందమయంగా జరుపుకోవాల్సిన పండుగ రోజున.. మనం చేసే చిన్న చిన్న పొరపాటులే.. ఎంతో విషాదాన్ని మిగిలుస్తాయి. దీపావళి చేసుకునే సమయంలో బాణాసంచా కాల్చే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బాణాసంచా విక్రయాలు ప్రారంభమయ్యాయి. నేడు దీపావళి కావటంతో మరింత రెట్టింపు ఉత్సాహంతో విద్యార్థులు, యువత, చిన్నారుల బాణాసంచా కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా పరిధిలో మొత్తం 120 షాపులకుపైగా ఏర్పాటు చేశారు. ఏడాది మొత్తం నడిచే గోడౌన్‌లు సుమారుగా 22పైగా గుంటూరు జిల్లాలో ఉన్నాయి. టపాసులు కాల్చే సమయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారుల విషయంలో మనమెప్పుడు అప్రమత్తంగా ఉండాలి. గతంలో ఆరేళ్ల చిన్నారి దుస్తులుపై నిప్పురవ్వలు పడి.. దుస్తులకు మంటలు అంటుకుని.. శరీరమంతా గాయాలపాలైన సంఘటన చోటుచేసుకుంది. ఇటువంటి జరగకుండా ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగుల హరివిల్లు పూయించాలని కోరుకుందాం.

నిబంధనల ప్రకారమే లైసెన్స్‌లు

బాణాసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో రెవెన్యూ, ఫైర్, పోలీసు అధికారుల అనుమతులు తప్పనిసరి. పూర్తిస్థాయిలో అధికారులు ధ్రువీకరించిన తరువాతనే షాపు ఏర్పాటుకు అనుమతినిస్తారు. ఖాళీ స్థలంలో దుకాణం ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఉంటాయి. ఈ ప్రాంతంలో ఎటువంటి పాఠశాలలు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ వంటివి ఉండకూడదు. ఒక 50 షాపులు ఉంటే దానిని క్లస్టర్ అని అంటారు. అంతకు మించి ఆ గ్రౌండ్స్‌లో దుకాణాలకు అనుమతి ఇవ్వకూడదు. జిల్లా కేంద్రంలో జిల్లా ఫైర్ ఆఫీసర్, గ్రామీణ ప్రాంతాలలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తాత్కాలిక అనుమతులు ఇచ్చారు. హోల్‌సేల్ వ్యాపారాలకు సంబంధించి ఉన్న సరుకు లిస్ట్, కట్టిన జీఎస్టీ, తదితర అంశాలను పరిశీలించి అనుమతులు ఇస్తారు. దీనితో పాటుగా ప్రతి బాణాసంచా దుకాణం వద్ద ఇసుకతో ఉన్న బక్కెట్లు, ఫైర్ సేఫ్టీ ప్రికాషన్స్ తప్పని సరిగా పాటించాల్సి ఉంటుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే....



- లైసెన్స్ షాపుల నుంచే బాణసంచా కొనుగోలు చేయాలి
- అగ్ని ప్రమాదాలు జరగని ప్రదేశంలో వీటిని భద్రపరచాలి
- బాణసంచా కాల్చే సమయంలో వాటిపై ఉన్న నిబంధనలు చదివి పాటించాలి, ఖాళీ ప్రదేశాల్లోనే కాల్చాలి
- బాణసంచా కాల్చేటప్పుడు నీటిని అందుబాటులో ఉంచుకోవాలి
- కాటన్ దుస్తులు ధరించాలి, ఖచ్చితంగా చెప్పులు ధరించాలి
- జనావాసాలు, రద్దీ ప్రాంతాలలో పెద్దపెద్ద టపాసులు కాల్చరాదు
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్న పిల్లలు బాణాసంచా కాల్చాలి
- కాలని క్రాకర్స్ వద్దకు వెళ్లి దాన్ని చేతులతో పరీక్షించవద్దు
- బాంబుల వంటి వాటిని చేతితో పట్టుకుని కాల్చవద్దు
- లూజుగా ఉండే దుస్తులు ధరించరాదు
- సొంతంగా తయారు చేసిన బాణసంచాను కాల్చే యత్నం చేయవద్దు.

ఈ నిబంధనలు తప్పని సరి.....

- షాపులు ఖాళీ ప్రదేశాలలో మాత్రమే ఏర్పాటు చేయాలి.
- జనావాసాలకు దూరంగా ఉన్న ఒక అంతస్తు మాత్రమే ఉండే భవనాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు.
- దుకాణానికి, దుకాణానికి మధ్య ఖాళీ ఉండాలి. అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి.
- ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగితే తక్షణం నియంత్రించేలా ఏర్పాట్లు ఉండాలి.

అట్రాసిటీ కేసుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్



మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ చైర్మన్

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో కొంత మంది పోలీసులు, అధికారులు అలసత్వం వహిస్తున్నారని, ఈ పద్ధతి మారాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ పేర్కొన్నారు. జవహర్ మిత్రమండలి ఆధ్వర్యంలో గుంటూరులోని ఎన్జీఓ కల్యాణ మండపంలో కెఎస్ జవహర్ దంపతులకు సత్కార సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చెప్పినప్పటికీ పోలీసులు, ఇతర అధికారులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీనిపై త్వరలో సీఎస్‌ను కలిసి సమస్యను వివరిస్తామని చెప్పారు. అదే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 19 వలన ఎస్సీ ఉద్యోగుల్లో తలెత్తుతున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్తాన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సగటు వర్షపాతం 13.2 మిల్లీమీటర్లు

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో 15 మండలాల్లో వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా మంగళగిరి మండలంలో 74.2 మిల్లీ మీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 1.2 మి.మీ వర్షం కురిసింది. సగటున 13.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తాడేపల్లి మండలంలో 69.6 మి.మీ., పెదకాకాని 20.2, తుళ్లూరు 14.2, కొల్లిపర 13.4, చేబ్రోలు 12.2, తాడికొండ 7.6, దుగ్గిరాల 4.8, గుంటూరు తూర్పు 4.2, వట్టిచెరుకూరు 4.2, కాకుమాను 3.8, గుంటూరు పశ్చిమ 3.2, తెనాలి 2.6, ప్రత్తిపాడు మండలంలో 1.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. అక్టోబర్ 19వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 77.3 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 95.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

హేతువాద సాహిత్య పితామహుడు త్రిపురనేని

సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య



మాట్లాడుతున్న ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీ నరసయ్య

లక్ష్మీపురం: తెలుగునాట హేతువాద సాహిత్యానికి పునాదులు వేసిన వ్యక్తి త్రిపురనేని రామస్వామిచౌదరి అని ప్రముఖ సాహిత్య విమర్శకుడు జి.లక్ష్మీ నరసయ్య అన్నారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి పురస్కార ప్రదాన సభకు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ రామస్వామి సాహిత్యానికి వారసుడు కోయి కోటేశ్వరరావుకు, రామస్వామి సామాజిక సంస్కరణ ఉద్యమానికి వారసుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు రామస్వామి పురస్కారాలు ఇవ్వడం సముచితమని అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ వందేళ్ల క్రితం సమాజంలో ఉన్న అసమానతల మీద తిరుగుబాటు సాహిత్యం రచించిన వ్యక్తి త్రిపురనేని రామస్వామి అని అన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ తెలుగునాట బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం ప్రారంభించింది రామస్వామి అని అన్నారు. అనంతరం కోయి కోటేశ్వరరావు, ఆలా వెంకటేశ్వర్లులకు త్రిపురనేని రామస్వామి పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. సభలో ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు, డాక్టర్ అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరరీ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్, డాక్టర్ మూకిరి సుధ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బాపట్లటౌన్: మండలంలోని జమ్ములపాలెం పంటకాలువలోకి గుర్తుతెలియని మృతదేహం కొట్టుకువచ్చిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. మృతుడి శరీరంపై బూడిద రంగు టీ షర్ట్, నలుపు రంగు నైట్ లోయర్(ప్యాంటు), కుడి చేతికి దేవుడు బొమ్మలు కలిగిన తాడు కట్టుకొని ఉన్నారు. వివరాలకు 9440796258 సంప్రదించాలని కోరారు.



తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

రెండు సవర్ల బంగారం ఆభరణాలు మాయం!

యడ్లపాడు: మండలంలోని కోట గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. ఇంటి యజమాని ఊరు వెళ్లిన సమయంలో దుండగులు చొరబడి సుమారు బంగారం, వెండి, ఇత్తడి వస్తువులను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోట గ్రామానికి చెందిన షేక్ ఖైరున్నీసా ఈనెల 16వ తేదీ మధ్యాహ్నం నరసరావుపేటలోని తన కోడలి ఇంటికి వెళ్లింది. రెండురోజుల తర్వాత 18వ తేదీ సాయంత్రం కోట గ్రామానికి తిరిగి రాగా ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించింది. 12 గ్రాముల బంగారు గొలుసు, 4 గ్రాముల చెవిదుద్దులు, వెండిపట్టీలు, ఇత్తడి సామగ్రి అపహరణకు గురైనట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేశారు. వెంటనే క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని, ఆధారాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

చలన చిత్ర చరిత్రలో 'ఘంటసాల ది గ్రేట్' అద్భుతం

చీరాల: తెలుగు సినిమా చరిత్రలో 'ఘంటసాల ది గ్రేట్' చిరస్థాయిగా నిలిచి పోతుందని ఆ సినిమా డైరెక్టర్ సీహెచ్. రామారావు అన్నారు. చీరాలలోని మోహన్ థియేటర్‌లో ఆదివారం ప్రదర్శించిన ప్రివ్యూ షో సంగీత అభిమానులను ఆకట్టుకుంది. చీరాలలో డైరెక్టర్ సీహెచ్. రామారావు అభిమానులతో కలిసి సినిమా తిలకించారు. ప్రపంచ సినిమా చరిత్రలోనే తొలిసారిగా ఒక గాయకుడిపై తీసిన అరుదైన సినిమా' ఘంటసాల ది గ్రేట్ ' అని పేర్కొన్నారు. ఒక తరం సంగీతానికి ప్రాణం పోసిన అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 12న విడుదల చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరెడ్డి, గాదె వెంకటరెడ్డి, గాదె హరిహరరావు, పాలెపు కనక మోహనరావు, రాజ్ వినయ్‌కుమార్, నాగవీరభద్రాచారి, ఏకాంబరేశ్వరబాబు, వీరనారాయణ, హరిహరరావు, రామారావు, రాజ్యలక్ష్మి, సునీత, రంగారావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు సూపర్‌సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని, మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 16వ మహాసభ తీర్మానించిందని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీదేవి తెలిపారు. ఇటీవల జరిగిన 16వ రాష్ట్ర మహాసభల్లో చేసిన తీర్మానాలను ఆమె ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సరళీకరణ ఆర్థిక విధానాల వలన మహిళా రంగంలో జరుగుతున్న మార్పులపై చర్చించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వలస మహిళలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోతున్నాయని చెప్పారు. డ్వాక్రా గ్రూపులలో అవినీతిని అరికట్టాలని, డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేకుండా రు.10 లక్షలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని, మైక్రో ఫైనాన్స్ దోపిడీ నుంచి కుటుంబాలను రక్షించాలని కోరారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని విన్నవించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత గ్యాస్ కొంతమందికే ఇస్తున్నారని, ఎన్నికల హామీలో ఇచ్చిన విధంగా అందరికీ 3 సిలిండర్లు ఇవ్వాలని, ప్రతి మహిళకు నెలకు రు.1500 ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం పోరాడాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఈ సమావేశంలో ఐద్వా కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి డి.శ్రీనివాసకుమారి, ఉపాధ్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

టెయిల్ పాండ్ ప్రాజెక్టు మూడు క్రస్ట్‌గేట్లు ఎత్తివేత

పులిచింతలకు 29,803 క్యూసెక్కులు విడుదల

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ మూడు క్రస్ట్ గేట్లు, రెండు యూనిట్ల ద్వారా 29,803 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ సుబ్రమణ్యం ఆదివారం తెలిపారు. టెయిల్‌పాండ్ ప్రాజెక్టు 3 క్రస్ట్‌గేట్లు 1.5 మీటర్లు ఎత్తు ఎత్తి 21,258 క్యూసెక్కులు, రెండు యూనిట్లు ద్వారా 8,545 క్యూసెక్కులు మొత్తం 29,803 క్యూసెక్కులను దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు నీటి మట్టం 75.50 మీటర్లకు గాను 75.50 మీటర్లకు నీరు చేరుకుందని రిజర్వాయర్‌లో గరిష్ట స్థాయిలో 7.080 టీఎంసీలకు గాను 7.080 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. టీఆర్‌సీ లెవల్ 55.68 మీటర్లకు చేరుకుందన్నారు. ప్రస్తుతం ఎగువ నున్న నాగార్జున సాగర్ నుంచి 34,185 క్యూసెక్కుల నీరు వస్తుందని పై నుంచి వచ్చే వరదను బట్టి దిగువనున్న పులిచింతలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

గురుధాంలో పీవీ సింధు దంపతులు

బలుసుపాడు(జగ్గయ్యపేట): గురుధాం క్షేత్రాన్ని ఒలంపిక్ విజేత, పద్మభూషణ్, అర్జున్ ఖేల్ రత్న అవార్డు గ్రహీత, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సద్గురు శివానందమూర్తి పల్లకి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వ్యవస్థాపకుడు గెంటేల వెంకట రమణ దంపతులు వారిని సత్కరించారు. అనంతరం సింధు మాట్లాడుతూ గురుధాం క్షేత్రానికి తన చిన్నతనం నుంచే వస్తున్నానన్నారు. తమ తల్లిదండ్రుల సహకారంతోనే ఈ స్థాయికి ఎదిగానని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శివానంద కృప సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

15 మందికి గాయాలు

గురజాల: పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 15 మందిని గాయపర్చింది. నగర పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం రోడ్డులో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పిచ్చి కుక్క కనిపించిన వారిని కనిపించినట్లు కరుస్తూ వెళ్తుంది. కుక్క దాడిలో 15 మందికి గాయాలు కాగా గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. నగర పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి కుక్కలను పట్టించి అడవిలో వదిలి వేయాలని కోరుతున్నారు. ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

రైలులో లైంగిక దాడికి పాల్పడిన నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడించిన రైల్వే పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు రైల్వే ఐఆర్‌పీ సీఐ పి.కరుణాకరరావు, రైల్వే ఆర్పీఎఫ్ పోలీసులు

లక్ష్మీపురం: రైలులో మహిళపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. రైలు నంబర్ 07222 సంత్రాగచి- చర్లపల్లి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లో రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ఈనెల 13వ తేదీన మహిళా బోగిలో రాజమండ్రి ప్రాంతానికి చెందిన మహిళ ఎక్కింది. చర్లపల్లి వెళ్తుండగా సుమారు రాత్రి 7.05 గంటల సమయంలో రైలు గుంటూరు రైల్వే స్టేషన్‌కు చేరింది. మహిళా బోగిలో ఉన్న తోటి ప్రయాణికులందరూ బోగిలో నుంచి దిగిపోయారు. ఇది గమనించిన పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, లక్కరాజు గార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రాజారావు, రైలు కదిలే సమయంలో మహిళా బోగిలో ఎక్కేందుకు తలుపు తీయాల్సిందిగా కోరాడు. దీంతో బాధితురాలు ఇది మహిళా బోగి అని ఎంత చెప్పిన వచ్చే రైల్వే స్టేషన్‌లో దిగి పోతానని చెప్పి బాధితురాలిని తలుపు తీసేందుకు ఒప్పించాడు. దీంతో బాధితురాలు బోగి తలుపులు తీయడంతో లోపలికి ప్రవేశించి తలుపులు లోపలి నుంచి మూసి వేశాడు. రైలు నల్లపాడు రైల్వే స్టేషన్ దాటిన తరువాత నిందితుడు, బాధితురాలికి కత్తి చూపించి, బెదిరించి ముఖంపై చేతులు వేసి ఆమెను కొట్టి బాధితురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తరువాత రైలు నెమ్మదిగా పెదకూరపాడు రైల్వే స్టేషన్‌ను సమీపిస్తుండగా బాధితురాలి వద్ద ఉన్న రూ.5,600, పరుసు, సెల్‌ఫోన్ లాక్కుని నిందితుడు రైలు నుంచి దూకి పారిపోయాడు. బాధితురాలు అదే రైలులో సికింద్రబాద్ స్టేషన్‌కు చేరుకుని జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేయడం జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బాధితురాలిని వైద్య పరీక్షలకు ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు.

నడికుడికి కేసు బదిలీ..

ఈ ఘటన చోటు చేసుకున్న ప్రాంతం నడికుడి జీఆర్పీ పరిధిలో ఉండడంతో కేసును నడికుడికి బదిలీ చేశారు. దీంతో అప్రమత్తం అయిన నడికుడి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని గాలించేందుకు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేశారు. గాలింపు చర్యల్లో భాగంగా ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో గుంటూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులకు 8వ ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి పారిపోతుండగా అదుపులో తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించగా సీసీ కెమెరాల్లో గుర్తించిన వ్యక్తిగా నిర్ధారించారు. విచారించగా నేరం అంగీకరించడంతో పోలీసులు రాజారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో గుంటూరు ఐఆర్‌పీ లైన్ సీఐ కరుణకరరావు, జీఆర్పీ సీఐ అంజిబాబు, ఆర్పీఎఫ్ సీఐ వీరబాబు, ఎస్ఐలు పి.రమేష్, రాజమోహన్, శ్రీనివాసరారెడ్డి, కానిస్టేబుల్ ఆశ్వీన్, నాసర్ వలి, హెడ్ కానిస్టేబుల్ వి.శంకర్లను అధికారులు అభినందించారు.







